క్లుప్తంగా

నాణ్యతగా మధ్యాహ్న భోజనం


పదార్థాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద మధ్యాహ్న పథకం కింద రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని వంట నిర్వాహకులకు ఎంఈఓ మునిసుబ్రమణ్యం తెలిపారు. ఆయన శనివారం మండలంలోని కాంపాళెం గ్రామం, గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేశారు. పదార్థాల రుచి చూశారు. ఆయన మాట్లాడుతూ మెనో ప్రకారం భోజనాన్ని అందించాలని తెలిపారు.

శాస్త్రోక్తంగా శనీశ్వరస్వామికి పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీశనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

13న హుండీ కానుకల లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయాన్ని ఈనెల 13వ తేదీ మంగళవారం లెక్కించనున్నట్లు దేవస్థానం డిప్యూటీ ఈవో వెంకటసుబ్బయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల్లోని కానుకలను దక్షిణామూర్తి సన్నిధిలో లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది తప్పని సరిగా పాల్గొనాలని తెలిపారు.

చదువుతోనే ఉన్నత స్థానాలు


కందాడులో కళాజాత ప్రదర్శన

ఏర్పేడు: ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, చదువుతోనే ఉన్నతస్థానాలు సాధ్యమని కళాజాత ప్రదర్శనలతో అవగాహన కల్పించారు. మండలంలోని కందాడు, శివగిరి కాలనీ, కుక్కలగుంట, పాయిల్‌సెంటర్ గ్రామాల్లో శనివారం ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమం జరిగింది. విద్య అవస్యకత, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాగేశ్వరరావు కళాబృందం పాటలు, నాటికల రూపంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రగతి సంస్థ పాపానాయుడుపేట క్లస్టర్ కన్వీనర్ సుబోస్, ప్రతినిధులు రాజేశ్వరి, సుమలత, పాల్గొన్నారు.

ఆటో బోల్తా యువకుడు మృతి

శ్రీకాళహస్తి : మండలంలోని చల్లపాళెం ఎస్సీకాలనీ వద్ద శనివారం ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. రూరల్ సీఐ అజయ్‌కుమార్ కథనం మేరకు.. చల్లపాళెం ఎస్సీకాలనీకి చెందిన రమణయ్య(21) ఆటోలో ఎంఎంసీ కండ్రిగకు వెళుతున్నాడు. ఆటో నాయుడుపేట–పూతలపట్టు రహదారిపైకి రాగానే, వెనుక నుంచి కారు వేగంగా రావడంతో తప్పించబోయి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో నుంచి రమణయ్య కిందపడి అక్కడిక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళాభ్యున్నతే జగనన్న ధ్యేయం

- వైఎస్సార్ సీపీ నాయకురాలు పవిత్రారెడ్డి
- సంబరంగా వైఎస్సార్ ఆసరా పంపిణీ
- 8,126మందికి రూ.8,10,40,981 జమ
- నాలుగు విడతల్లో రూ.31.57 కోట్ల పంపిణీ


సభకు హాజరైన మహిళలు


ఆసరా మెగా చెక్కును మహిళలకు అందజేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా ఎదగాలని, మహిళా సంఘాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె, వైఎస్సార్ సీపీ నాయకురాలు పవిత్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో పండుగ వాతావరణంలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు జరిగాయి. కార్యక్రమంలో 890 స్వయం సహాయక సంఘాల్లోని 8,126 మంది సభ్యులకు రూ.8,10,40,981 మెగా చెక్కును పవిత్రారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్‌కు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు విడతలకు గాను రూ. 31.57కోట్లు మహిళా సంఘాలకు లబ్ధి చేకూరిందని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా ఈ ప్రభుత్వం మహిళా సంఘాలకు ఎంతో లబ్ధి చేకూరుస్తోందన్నారు. పథకాల లబ్ధి మొత్తాలు కూడా మహిళల ఖాతాలకే జమ చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నిత్యం ప్రజల్లో ఉంటూ కష్ట సుఖాలను తెలుసుకుంటున్నారన్నారు. 3దశాబ్దాల్లో జరగని అభివృద్ధి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నాలుగున్నర ఏళ్లలో మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిందని తెలిపారు. కరోనా సమయంలో సొంత నిధులతో నియోజకవర్గ ప్రజలను ఎమ్మెల్యే ఆదుకున్నారని పేర్కొన్నారు.అనంతరం మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌లో హ్యాండ్‌క్రాఫ్ట్స్, కలంకారీ, ఫ్యాన్సీ, చేనేత, ఫ్యాన్సీ డిజైన్ చీరలు, ఆహా(అన్ని రకాల ఫుడ్ ఐటమ్స్)ను స్టాల్స్‌ను బియ్యపు పవిత్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు రంజింపజేశాయి. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి సభ్యురాలు సుమతి, సీఎంఎం ప్రసాద్, మెప్మా సిబ్బంది అమ్మాజీ, స్వాతి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ముంతాజ్‌బేగం తదితరులు పాల్గొన్నారు.


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్‌కు పాలాభిషేకం

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తిరుపతి(అలిపిరి): అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లిలో వెలసిన శ్రీప్రసన్నవెంకటరమణ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం ధ్వజారోహణంతో శాస్త్రోక్తంగా ప్రారంభమైనట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్నవెంకటరమణ స్వామి ఉత్సవమూర్తులు, గరుడ ధ్వజపటాన్ని ఆలయ ప్రదక్షిణగా తీసుకొచ్చి సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 10.35 నుంచి 11.30 గంటల మధ్య ధ్వజారోహణ ఘట్టాన్ని నిర్వహించారు. రాత్రి పల్లకీ ఉత్సవం చేపట్టారు. బ్రహ్మోత్సవాల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు వాహనసేవలు జరుగుతాయి. ఈనెల 15వ తేదీ రాత్రి 8 నుంచి 10 గంటల వరకు కల్యాణోత్సవం వైభవంగా జరుగనుంది. రూ.300 చెల్లించి గృహస్తులు(ఇద్దరు) పాల్గొనవచ్చు. ఫిబ్రవరి 19వ తేదీ సాయంత్రం పుష్పయాగం ఉంటుంది. ఉత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రోజూ వాహన సేవల ముందు కోలాటాలు, భజన కార్యక్రమాలు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంకీర్తనల లహరి ఉంటుందని ఈఓ వివరించారు.

జగనన్నతోనే సుపరిపాలన సాధ్యం


ప్రచారం నిర్వహిస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

- అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి
- సిద్ధం కార్యక్రమంలో బియ్యపు శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి అన్నారు. సిద్ధం కార్యక్రమంలో భాగంగా శనివారం తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం, చర్చి కాంపౌండ్, ఎస్టీకాలనీ, జ్ఞానాంబకండ్రిగ, దళితవాడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరించి సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన సాగిస్తున్నారని తెలిపారు. నాడు–నేడు కింద పాఠశాలలు, ఆస్పత్రులను ఆధునీకీకరించినట్లు పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు ఇంటిముంగిటకే అందుతున్నాయని తెలిపారు. బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నిత్యం ప్రజాసేవలోనే ఉంటున్నారని పేర్కొన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 30ఏళ్లపాటు జరగని అభివృద్ధి నాలుగున్నర ఏళ్లలో మధుసూదన్‌రెడ్డి చేసి చూపించారని తెలిపారు. ఎన్నికలు రానున్న నేపథ్యంలో నాలుగు సంవత్సరాలు కనిపించకుండాపోయిన ప్రతి పక్షపార్టీ నేతలు ప్రజలను మాయమాటలతో దగా చేసేందుకు వస్తున్నారని, ప్రజలు వారి మాటలను నమ్మవద్దని సూచించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉన్నం వాసునాయుడు, ఎంపీపీ నిర్మలమ్మ, సర్పంచ్ నాగమణి, ఎంపీటీసీ సభ్యురాలు పద్మ, కన్వీనర్ సుబ్బరాయుడు, నాయకులు హరిబాబు, విజయ్‌యాదవ్, ప్రకాష్‌యాదవ్, పీటర్, నాగముని, కిరణ్, చక్రవర్తి, హరిగోపాల్, గెరటారెడ్డి, రమేష్, కోవిచంద్రయ్యనాయుడు, ప్రేమ్‌కుమార్, మణినాయుడు, వెంకట్రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడు మృతి


శ్యామ్ మృతదేహం

నాగలాపురం: మండలంలోని సద్దికూడుమడుగు జలపాతంలో రెండు రోజులు క్రితం గల్లంతైన యువకుడి మృతదేహాన్ని అధికారులు వెలికి తీశారు. బుధవారం విహార యాత్రకని తమిళనాడులోని కండ్రత్తూర్ కాలేజ్ నుంచి తొమ్మిది మంది విద్యార్థులు సద్దికూడుమడుగుకు వచ్చారు. అందులో శ్యామ్(20) అనే యువకుడు జలపాతంలో ఈత కొడుతూ మునిగిపోయాడు. స్థానిక ఎస్ఐ ఓబయ్య సిబ్బంది సాయంతో రెండు రోజులుగా వెదుకుతున్నా ప్రయోజనం లేకపోయింది. శనివారం ఎట్టకేలకు శ్యామ్ మృతదేహం లభ్యమైంది. ఈ సందర్భంగా ఎస్ మాట్లాడుతూ సద్దికూడు మడుగులో పర్యాటకులకు అనుమతులు లేవన్నారు. అనంతరం మృతదేహాన్ని పంచానామా నిమిత్తం నాగలాపురం ఆస్పత్రికి తరలించారు.

రాజీయే రాజమార్గం


మాట్లాడుతున్న న్యాయమూర్తులు

శ్రీకాళహస్తి: రాజీ మార్గమే రాజమార్గమని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్, శ్రీకాళహస్తి సీనియర్ సివిల్‌జడ్జి బేబీరాణి, జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలన్నారు. అన్ని రకాల కేసులను లోక్ అదాలతో పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- నేటి నుంచి ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- 20 తేదీ వరకు వాహన సేవలు


ఊరేగింపునకు సిద్ధమైన వాహనాలు

తిరుపతి అర్బన్: తిరుపతి అన్నమయ్య సర్కిల్ సమీపంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏడాది క్రితం నిర్మించిన శ్రీలక్ష్మీ పద్మావతి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. బ్రహ్మోత్స వాలకు సర్వంసిద్ధం చేసినట్లు, అందరూ ఆహ్వానితులేనని ఆలయ చైర్మన్ చిన్న వెంకటేశ్వర్లు వెల్లడించారు. శనివారం ఆయన ఆలయ కమిటీ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఈనెల 11న అంకురార్పణ, 12న ఉదయం ధ్వజారోహణం, రాత్రి పెద్దశేషవాహనం, 13న ఉదయం చిన్నశేష,రాత్రి హంస వాహన సేవలు, 14న ఉదయం సింహ, రాత్రి ముత్యపు పందిరి వాహన సేవలు, 15వ తేదీ ఉదయం కల్పవృక్ష ,రాత్రి సర్వభూపాల వాహన సేవలు, 16న ఉదయం మోహిని అవతారం,రాత్రి గరుడ వాహన సేవ ఉంటుందని వివరించారు. 17న ఉదయం హనుమంత వాహనం,సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి గజ వాహనం, 18న తేదీ ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహన సేవలు, 19వ తేదీ ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 20న ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం ఉంటుందని వివరించారు. భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

అడ్డగోలు రాతలు మానుకోవాలి

శ్రీకాళహస్తి: పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో ఇళ్లపట్టాలకు కులసంఘం నేతలు వసూళ్లు చేస్తున్నారని ఈనెల 8వ తేదీన ఆంధ్రజ్యోతి వచ్చిన కథనం అవాస్తమని చెంచులక్ష్మి యానాదికాలనీ వాసులు స్పష్టం చేశారు. ఇది వాస్తవ దూరమని, అడ్డుగోలు రాతల మానుకోవాలని ఆంధ్రప్రదేశ్ యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చందమామల కోటయ్య ఖండించారు. శనివారం చెంచులక్ష్మి యానాదికాలనీ వాసులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కాలనీ వాసులు మాట్లాడుతూ తమకు చందమామల కోటయ్య సాయం చేస్తున్నారన్నారు. ఇళ్లపట్టాల విషయమై తాము కోటయ్యను సంప్రదించగా ఆయన అధికారులతో మాట్లాడారని తెలిపారు. తాము ఆయనకు ఎలాంటి డబ్బులు ఇవ్వలేదన్నారు. తమకు కేవలం సాయం మాత్రమే చేస్తున్నారన్నారు. ఇలాంటి వ్యక్తిపై ఆంధ్రజ్యోతిలో అవాస్తవ కథనం రాయడం సరికాదన్నారు. ఇకనైనా ఇలాంటివి మానుకోవాలని హెచ్చరించారు.

పదిలో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం


కురింజలంలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో మెరుగైన ఫలితాల కోసం ఇంటిబాట కార్యక్రమాన్ని చేపట్టినట్టు ప్రధానోపాధ్యాయుడు రూపేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని తలారివెట్టు, కల్లివెట్టు, కురింజలం, ఎన్టీఆర్ నగర్ గ్రామాల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు యువశ్రీమురళి, నాదెండ్లమురళి రాత్రి పూట వెళ్లి చదువుతున్నారా, లేదా, అని పర్యవేక్షించారు. విద్యార్థుల సామర్థ్యాలను తల్లిదండ్రులకు తెలిపారు. వారు మాట్లాడుతూ విద్యార్థులను అప్రమత్తం చేసేందుకు రోజూ రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు హౌస్ విజిట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల సామర్థ్యం తల్లిదండ్రులకు తెలుస్తుందని, తద్వారా బాగా చదివిస్తారని తెలిపారు.

మాదాపూర్ నారాయణలో శ్రీకాళహస్తి విద్యార్థి ఆత్మహత్య

శ్రీకాళహస్తి: హైదరాబాద్ మాదాపూర్ నారాయణ కళాశాలలో శ్రీకాళహస్తికి చెందిన విజయ్ తరగతి గదిలో శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విద్యార్థి మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో రామానుజన్ క్యాంపస్ నారాయణ కళాశాలలో ఐఐటీ లాంగ్ కోచింగ్ తీసు కుంటున్నాడు. ఫలితాల్లో మార్కులు తక్కువ వచ్చాయనే మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల పంపిణీ ప్రారంభం


ఎరువులను తీసుకెళుతున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులను పంపిణీ చేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు. శనివారం బుచ్చినాయుడుకండ్రిగ రైతు భరోసా కేంద్రంలో రైతులకు యూరియా, డీఏపీ, ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పలు పథకాలను ప్రవేశ పెడుతోందని తెలిపారు. భరోసా కేంద్రాల ద్వారా రైతులకు 21 రకాల సేవలు అందుతున్నాయని, అందులో ముఖ్యంగా వైఎస్సార్ రైతు భరోసా, నాణ్యమైన ఉత్పదకాల సరఫరా, సబ్సిడీ విత్తనాల పంపిణీ, ఈ–పంట, పంట నమోదు, మార్కెట్ ధరలు, వ్యవసాయ యంత్రీకరణ, పశువైద్యం, ఉద్యానవనశాఖ, పట్టుపరిశ్రమ, వాతావరణ సూచనలు, సలహా మండళ్లు, మట్టి పరీక్షలు ఉన్నాయని తెలిపారు.

హనుమంతునిపై వీరరాఘవుని విహారం


హనుమంత వాహనంపై వీరరాఘవస్వామి

నారాయణవనం: మండల కేంద్రంలోని శ్రీకనకవల్లీ, వేదవల్లీ సమేత వీరరాఘవస్వామి ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం హనుమంత వాహనంపై స్వామివారు కటాక్షించారు. కేరళ సంప్రదాయ వాయిద్యాల మధ్య కొనసాగిన ఊరేగింపులో మహిళలు హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో వెయ్యిమందికి పైగా భక్తులకు నిర్వాహకులు అన్న ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం చక్రస్నానంతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. ఆదివారం సాయంత్రం ఆలయంలో పుష్పయాగం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. భక్తులు పాల్గొన్ని వీక్షించి తరించాలని కోరారు.

మాజీ మంత్రి మోపిదేవికి స్వాగతం


స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

రేణిగుంట: రాష్ట్ర మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణకు శనివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. శ్రీకాళహస్తిలో ఆదివారం జరగనున్న 'వన్నెకుల క్షత్రియ జైత్రయాత్ర రాయలసీమ రీజియన్ మహాసభ'లో ఆయన పాల్గొనేందుకు వచ్చారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో తిరుపతికి వెళ్లారు.

ఇంటిని మరిపించేలా 'గోరుముద్ద'

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు జగనన్న గోరుముద్ద పథకం కింద పౌష్టికాహారం అందిస్తున్నారు. తద్వారా ఆరోగ్యంతో పాటు చదువుల్లో రాణిస్తున్నారు. పోషక విలువలు పెంచేందుకు వారంలో రోజూ చిక్కీతో పాటు ఉడికించిన గుడ్డు ఆహారంలో అందిస్తూ మరింత రుచికరంగా చేశారు. ఈ ఏడాది నుంచి వారంలో 3 రోజులు ఉదయం 9 గంటలకు రాగిజావ అందిస్తున్నారు. వడ్డించే ఆహారంలో నాణ్యత ప్రమాణాలు పెరుగుతుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

- మధ్యాహ్న భోజనం మరింత రుచిగా
- –విద్యార్థులకు పౌష్టికాహారం అందజేత
- –వడ్డించే ఆహారం మోతాదును పెంచిన ప్రభుత్వం
- –అధికారుల పర్యవేక్షణలో పెరుగుతున్న నాణ్యతా ప్రమాణాలు




వరదయ్యపాళెంలో మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న వంట నిర్వాహకులు, చిక్కీలు

వరదయ్యపాళెం: జగనన్న గోరుముద్ద పథకం కింద ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు పెరుగుతుండడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల్లో ఐరన్, ఇతర పోషకాలు పెరుగుతున్నాయి. గతంలో వారంలో 3 సార్లు మాత్రమే గుడ్డు సరఫరా చేసేవారు. తాజాగా రోజూ సరఫరా చేస్తున్నారు. ఏ వారం అందించే గుడ్లుపై ఆ రంగులను ప్రభుత్వం ముద్రిస్తోంది. దీంతో విద్యార్థులకు తాజా గుడ్లు అందించేందుకు వీలు ఉంటుందని ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు గతంలో మధ్యాహ్న భోజన పథకంపై ఎలాంటి పర్యవేక్షణ ఉండేది కాదు. తహసీల్దార్, ఎంపీడీఓ, ఆ పాఠశాల హెచ్ఎం మాత్రమే మధ్యాహ్న భోజనం కమిటీ సభ్యులుగా ఉండేవారు. ప్రస్తుతం జగనన్న గోరుముద్ద సక్రమంగా అమలు అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు వారి వారి విధుల్లో భాగంగా మండల కేంద్రాలకు, గ్రామాలకు వెళ్లినప్పుడు మధ్యాహ్న భోజన నిర్వహణపై తనిఖీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అలాగే ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, పీఎంపీ కమిటీలు, గ్రామ, వార్డు సచివాలయ అధికారులకు పర్యవేక్షణ కమిటీ బాధ్యతలు అప్పగించారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు జగనన్న గోరుముద్ద నాణ్యతగా, పౌష్టికంగా అందుతోంది.

సత్యవేడు నియోజకవర్గంలో..:
సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, కేవీబీపురం, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు మండలాల్లో 388 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 30వేలకు పైగా విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా రుచికరమైన, నాణ్యతతో కూడిన కమ్మటి భోజనం అందిస్తున్నారు. ఈకొత్త మెనూ విధానం చాలా బాగుందని విద్యార్థుల తల్లిదండ్రులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కతజ్ఞతలు చెబుతున్నారు.

మెనూ ఇలా..:
- సోమవారం : వెజిటెబుల్ పలావ్/హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు, చిక్కీ
- మంగళవారం : ఉదయం రాగిజావ, పులిహోర, పచ్చడి, గుడ్డు
- బుధవారం : కూరగాయల అన్నం, ఉడికించిన గుడ్డు, ఆలు కూర్మా, చిక్కీ
- గురువారం: ఉదయం రాగిజావ, సాంబార్ బాత్, టమాటా చట్నీ, ఉడికించిన గుడ్డు
- శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, గుడికించిన గుడ్డు, చిక్కీ
- శనివారం: ఉదయం రాగిజావ, ఆకుకూర, అన్నం, పప్పు చారు, తీపి పొంగల్

బలవర్థక ఆహారం



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో రుచికరమైన ఆహారం అందిస్తున్నారు. గతంలో నిత్యం ఒకే రకమైన ఆహారం తీసుకోవడం వల్ల పిల్లలు ఇబ్బందిపడేవారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త మెనూ వల్ల విద్యార్థులకు బలవర్థక ఆహారం (పౌష్టికాహారం) అందుతోంది. దీంతో పాటు పర్యవేక్షణ పెరిగింది.
–రమణయ్య, హెచ్ఎం, వరదయ్యపాళెం హైస్కూల్

విద్యాభివద్ధికి ఎంతో ప్రాధాన్యం



ప్రభుత్వం విద్యాభివద్ధికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. నూతన మెనూ వల్ల విద్యార్థులకు మేలు చేకూరుతోంది. రోజుకో రకమైన ఆహారం అందించడం వల్ల విద్యార్థులు ఇష్టంగా పాఠశాలలకు వచ్చి భోజనం చేస్తున్నారు. ఇది ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎంతో ఉపకరిస్తుంది. విద్యార్థుల హాజరు శాతం పెరుగుతుంది.
–సరస్వతి, ఎంఈఓ, వరదయ్యపాళెం